

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

12 జనవరి 2026 పేజీలు : 08


## నెల్లూరును స్మార్ట్ సిటీ చేయాలన్నదే
# నా సంకల్పం



- ఆత్మకూరు బస్టాండ్ మరమ్మత్తులు పూర్తయిన ఫ్లైఓవర్ను ప్రారంభించిన మంత్రి నారాయణ
- ఫ్లైఓవర్‌పై బైక్ నడిపిన మంత్రి నారాయణ

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

నెల్లూరుని స్మార్ట్ సిటీ చెయ్యాలనేదే నా సంకల్పమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. మరమ్మత్తు పూర్తయిన ఆత్మకూరు బస్టాండ్ ఫ్లై ఓవర్‌ను మంత్రి నారాయణ ప్రారంభించారు. ముందుగా టిడిపి నేతలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం

-మిగతా 2లో

## సీమ ఎత్తిపోతలను నిలిపివేయడం..
# రైతులకు ఉరివేయడం

కండలేరు జలాశయానికి వెళ్లే ప్రయత్నం చేసిన కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కండలేరు డ్యామ్ వైపు వెళ్లే రహదారులలో అడుగడుగున పోలీస్ చెక్ పోస్ట్‌లు పెట్టి అడ్డుకున్నారు. పోలీసుల ఆంక్షలు ఏమాత్రం లెక్క చేయకుండా మాజీ మంత్రి కాకాణి, నియోజకవర్గ ఇన్చార్జిలు ముందుకు సాగారు. పోలీసుల నిర్బంధాన్ని లెక్కచేయకుండా అడ్డదారులలో కాలినడకన కండలేరు జలాశయానికి రైతులు చేరుకున్నారు. కండలేరు డ్యామ్ రోడ్డు ప్రధాన ద్వారం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, పోలీసులకు వాగ్వాదం, తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.



- మాజీ మంత్రి కాకాణి
- వైసీపీ, పోలీసుల మధ్య వాగ్వాదం
- నేతలు అరెస్టు.. విడుదల



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

సీమ ఎత్తిపోతలను నిలిపివేయడం.. రైతులకు ఉరివేయడమేనని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు రాపూరు రోడ్డును వైసీపీ శ్రేణులు దిగ్బంధించడంతో.. రాకపోకలకు అంతరాయం ఏర్పడ్డాయి. కండలేరు ముఖద్వారం వద్ద వైసీపీ నేతలని అడ్డుకోవడంపై కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 4 గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. మాజీ మంత్రి కాకాణి తదితరులను అరెస్టు చేసి రాపూర్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. వైసీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. అనంతరం మీడియాతో మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ.. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుపై

-మిగతా 2లో

## వడ్డే ఓబన్న యువతకు
# స్ఫూర్తిదాయకం


### జేసీ మొగిలి వెంకటేశ్వర్లు



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

స్వాతంత్ర సమర యోధుడు వడ్డే ఓబన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో.. వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. 1857 స్వాతంత్ర్య సమరానికి ముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల్లో వడ్డే ఓబన్న ఒకరన్నారు.

-మిగతా 2లో



## నూతనోత్సాహంతో..
# షాదీ మంజిల్ కమిటీ

- మంత్రి నారాయణ జిల్లా కలెక్టర్‌తో పాటు 13 సభ్యులు సారథ్యం
- నూతన కమిటీ సభ్యులను అభినందించిన మంత్రి నారాయణ
- షాదీ మంజీల్ అభివృద్ధికి కృషి చేయాలంటూ సూచన
- ఎకో సిస్టం చేసి రీసౌండ్ రాకుండా చేస్తామని మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :

కోటమిట్టలోని షాదీ మంజీల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. షాది మంజీల్ కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. షాది మంజిల్ని సౌండ్ ప్రూఫ్‌గా ఏర్పాటు చేయుటకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. షాది మంజిల్ నిర్వహణకు ఏర్పాటు చేసిన నూతన కమిటి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 2014-15 కాలంలో అప్పటి మేయర్ అబ్దుల్ అజీజ్ అభ్యర్థుల మేరకు షాదీ మంజీల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మందిర్ ఏర్పాటు తర్వాత గణనీయమైన అభివృద్ధికి నోచుకోలేదని అభిప్రాయపడ్డారు. షాదీ మంజీల్ నిర్వహణకు అధికారులు, పలువురితో కలిసి కమిటీని ఏర్పాటు చేశారన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యులు నేటి నుంచి పదవి బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. కమిటీ నేటి నుంచి కార్యాచరణ ప్రారంభిస్తుందని తెలిపారు. పెళ్ళి ఖర్చులు అధికమవుతున్నాయని, మెయింటెనెన్స్ ఖర్చులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కి అధిక మొత్తంలో ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, దానిని నిలువరించేందుకు నారాయణ గ్రూప్ నుండి ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌కి నారాయణ గ్రూప్ నుంచి

-మిగతా 2లో

## నెల్లూరును స్మార్ట్ సిటీ చేయాలన్నదే నా సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

ఫ్లైఓవర్‌పై మంత్రి నారాయణ బైక్ నడిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ అవకతవకల వల్ల అభివృద్ధి కుంటు పడిందని, మా ప్రభుత్వం వచ్చాక వైసీపీ ఆపేసిన అభివృద్ధి పనులు పునః ప్రారంభించామన్నారు. 1995లో ఆత్మకూరు బస్టాండ్ ఫ్లై ఓవర్‌కు అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఫ్లై ఓవర్‌పై మరమ్మతుల కోసం



రాకపోకలు ఆపామని, 45 రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. 2017లో నెల్లూరు ముంపుకు గురైందని, సీఎం చంద్రబాబు నెల్లూరులోనే 4 రోజులు ఉండి పరిస్థితిని సమీక్షించారన్నారు. ముంపు ముప్పును తప్పించేందుకు కాలువల ఆధునీకరణ పనులు చేస్తున్నామన్నారు. ఆక్రమణ దారులు సహకరించాలన్నారు.

## వడ్డే ఓబన్న యువతకు స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

వడ్డె ఓబన్న 1807 జనవరి 11న నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామంలో జన్మించి, గ్రామ రక్షకునిగా పనిచేస్తూ రైతులు, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ధీరుడని తెలిపారు. బ్రిటిష్ పాలనలో గ్రామ రక్షకుల జీతాలు రద్దు చేయడం, రైతులపై అధిక పన్నులు విధించడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ఈ అన్యాయాలను ప్రశ్నిస్తూ వడ్డే ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలోని ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. 1846లో కోవెలకుంట్ల తహసిల్దార్ కార్యాలయం, ఖజానాపై దాడి అనంతరం ఖజానా నిధులను పీడిత రైతులకు పంపిణీ చేయడం ద్వారా వడ్డే ఓబన్న ప్రజల పట్ల తన నిబద్ధతను చాటారని జేసీ గుర్తు చేశారు. వడ్డె, బోయ, యానాది, చెంచు వంటి వివిధ సామాజిక వర్గాల ప్రజలను ఏకం చేసి బ్రిటిష్ దళాలకు ఎదురొడ్డి పోరాడటం ఆయన నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. 1846 అక్టోబరు 6న పీరుసోముల గ్రామ సమీపంలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద జరిగిన యుద్ధంలో వడ్డే ఓబన్న వీర మరణం పొందినప్పటికీ, ఆయన త్యాగం తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందన్నారు. రైతుల హక్కులు, సామాన్యుల న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 11న వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ద్వారా ఆయన సేవలకు తగిన గుర్తింపు లభించిందని జేసీ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధుల త్యాగాలను యువత గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ముందుగా జేసీతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, వడ్డెర సంఘ నాయకులు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మీ, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్లు వల్లెపు మునిస్వామి, బత్తల క్రిష్ణయ్య, జిల్లా వడ్డెర నాయకులు గుంజి సుధాకర్, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు ఉప్పు భాస్కర్, వడ్డెర నాయకురాలు, బాలాజీ, వడ్డెర నాయకులు, ఇతర బిసి కుల సంఘ నాయకులు జనార్ధన్, బత్తల క్రిష్ణయ్య, బూధాటి రాధయ్య, బెల్లంకొండ శ్రీనివాసులు, ఉదయగిరి నరసింహ గౌడ్, పద్మజ యాదవ్, వెంకట్, ఇందుమతి, గుంజి దయాకర్, గుంజి సుధాకర్, పల్లపు రామతులసి, బాలాజీ, లలితారాం, ఉప్పల భాస్కర్, మల్లె లక్ష్మి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతనోత్సాహంతో షాదీ మంజిల్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)



నిధులు మంజూరు చేయడం జరిగిం దన్నారు. అదేవిధంగా 54 డివిజన్లో కళ్యాణ మండపం ఏర్పాటుకు 50 లక్షల రూపాయలు నారాయణ గ్రూప్ నుండి.. అదేవిధంగా పార్లమెంట్ సభ్యులు 50 లక్షల రూపాయలు నిధులు విడుదల చేయడం జరిగిందని, త్వరలో ప్రారంభించను న్నామని మంత్రి తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్న నాడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉద్దేశంతోటి తమకు అత్యంత మెజారిటీని ఇచ్చిన 42, 43, 48 డివిజనలకు చుట్టుపక్కల డివిజన్ల పేద విద్యార్థులకు వక్ఫ్‌బోర్డ్ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూలు ఏర్పాటు చేయుటకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తాను కటిక పేదరికం నుంచి వచ్చిన వాడినని, చదువుతూనే నేడు ఈ స్థాయికి ఎదగడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో 47 పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు 15 పాఠశాలలను, కమ్యూనిటీ భవనాలను ఆధునీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, అదేవిధంగా నగరపాలక సంస్థ కమిషనర్ వైస్ చైర్మన్‌గా ఉంటారన్నారు. మైనారిటీస్ వెల్ఫేర్ అధికారి, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మెంబర్లుగా ఉంటారని ఆయన అన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. 2014-19 కాలంలో షాదీ మంజిల్ చాలా చిన్నదిగా ఉండేదని, అప్పటి మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో షాదీ మంజిలో ఏర్పాటుకు బీజం పడిందన్నారు. పెళ్లి అనేది జీవిత కాలంలో గుర్తింపు ఉండేలా జరిగే విధంగా షాదీ మంజిల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. షాదీ మంజిల్ నిర్వహణకు నూతన కమిటీ తమవంతు సహాయ సహకారాలు అందిస్తుంద న్నారు. ఇది అందరూ ముస్లింలను వాడుకోవచ్చని, కేవలం పేదలకు మాత్రమే కాదన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ షాదీ మంజిల్‌ను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించి ఆదాయ వనరులు పెంచాలన్నారు. తద్వారా తల్లిదండ్రులు లేని 50 మంది మహిళలకు ఉచితంగా పెళ్లిళ్లు చేయాలన్నారు. నిరుపేదలకు 12 వేల రూపాయలలోపే షాదీ మంజిల్‌లను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులచే మంత్రి, వక్ఫ్‌బోర్డు చైర్మన్‌లు జమానుల్లా బాషా, ఇమాముద్దీన్, మహబూబ్ బాషా, హఫీజ్, రియా జ్ అహ్మద్, సయ్యద్ తహసీన, జాఫర్ షరీఫ్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమి షనర్ నందన్, ముస్లిం మత పెద్దలు, టిడిపి ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## 'సీమ ఎత్తిపోతలను' నిలిపివేయడం.. రైతులకు ఉరివేయడం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు కుట్ర బయటపడిందన్నారు. చంద్రబాబు తన నీడను చూసి కూడా భయపడుతున్నాడని, తనకు పుట్టగతులు ఉండవని భయంతో తమ పోరాటాన్ని అణిచివేయాలని కుట్రలు చేస్తున్నాడన్నారు. రైతుల ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తమ గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమశిల, కండలేరు జలాశయాల వద్దకు వెళితే తన చీకటి ఒప్పందం బట్టబయలవుతుందని వణికిపోతున్నాడన్నారు. అందువల్లనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జలాశయాల వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుపెట్టి నాటకమాడుతున్నాడని తెలిపారు. చంద్రబాబు నాయుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఉద్దేశపూర్వకంగానే నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని, తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచి చెబుతున్నారని, మా అనుమానాలు నేడు నిజమయ్యాయన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగిపోతే నెల్లూరు జిల్లాకి తీరని లోటన్నారు. తెలంగాణ తక్కువ ఎత్తు నుండి నీటిని తోడేసుకుంటుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు నిండి నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలకు నీళ్లు రావాలంటే చాలా కష్టమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబుతో జరిగిన రహస్య ఒప్పందం వల్లే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టు పెట్టారని, నెల్లూరు జిల్లావ్యాప్తంగా లక్షలాది ఎకరాలు ఎండిపోయి, లక్షలాది మంది రైతులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. పోలీసులు కండలేరు దగ్గరికి రావడానికి ఉన్న అన్ని మార్గాలలో అడుగడుగున చెక్ పోస్టు ఏర్పాటు చేసి నిర్బంధించే ప్రయత్నం చేశారన్నారు. ప్రతిపక్ష



పార్టీగా ప్రజల హక్కులను కాపాడే ప్రయత్నం మేము చేస్తుంటే మమ్మల్ని అడ్డుకొనే అధికారం పోలీసులకు ఎవరిచ్చారన్నారని, పోలీసుల లాఠీలకే కాదు.. తుపాకీ గుళ్ళకు కూడా భయపడమన్నారు. ప్రాణాలైనా వదులుకుంటాం కానీ, మీ తాటాకు చప్పులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. పోరాటంలో వెనకడుగు వేయడం మా నాయకుడు మాకు నేర్పించలేదన్నారు. అధికార పార్టీని మోటుకుని పోరాటం చేసే వారే పార్టీలో నిలబడ్డారు.. మిగిలిన వారు పార్టీ మారిపోయారన్నారు. మేము సోమశిల, కండలేరు జలాశయాలను సందర్శించి వాస్తవాలను రైతులకు వివరించాలనుకున్నామని, కానీ పోలీసులు మమ్మల్ని టెర్రరిస్టుల మాదిరిగా అడుగడుగునా చెక్ పోస్టులు పెట్టి అడ్డుకుంటున్నారని, దాదాపు 5-6 చోట్ల మమ్మల్ని నిలిపివేసి నిర్బంధించారన్నారు. చంద్రబాబు భయం తన చీకటి ఒప్పందాలు బయటపడతాయనే భయంతోనే చంద్రబాబు నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను, రైతులను చూసి వణికిపోతున్నారన్నారు. అందుకే పోలీసుల వెనుక దాక్కుని మమ్మల్ని అడ్డుకుంటున్నారన్నారు. గతంలో ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయి రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. జగన్ మోహన్ రెడ్డి దార్శనికత శ్రీశైలంలో నీటి మట్టం 800 అడుగుల వద్ద ఉన్నప్పుడే సాగునీటితోపాటు రాయలసీమ, నెల్లూరు జిల్లాల దాహార్తిని తీర్చాలని జగన్ ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తెచ్చారన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఈ ప్రాంతానికి ఒక 'సంజీవని' లాంటిదన్నారు. చంద్రబాబుకు తనకు లబ్ధి చేకూరే పనులపై తప్ప అభివృద్ధి పనుల ఎప్పుడూ నిర్లక్ష్యవైఖరే అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ఈ జలాశయాలకు పూర్తి సామర్థ్యంతో నీరు వచ్చిందన్నారు. సోమశిల నుంచి కండలేరుకు వచ్చే వరద కాలువ సామర్థ్యాన్ని జగన్ 24 వేల క్యూసెక్కులకు పెంచితే, ఈ కూటమి ప్రభుత్వం కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తలేదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేదన్నారు. రాష్ట్ర ప్రజల గురించి గానీ, రైతుల గురించి గానీ చంద్రబాబు ఎప్పుడు పట్టించుకోలేదన్నారు. చంద్రబాబుకు రైతులంటే చులకన భావం, రైతులను దొంగల్లాగా చూస్తారన్నారు. డిజిపి, ఐజిలు చెప్పారని హద్దు దాటి, మితిమీరి ప్రవర్తించొద్దు అన్నారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులను మేము గుర్తు పెట్టుకుంటామని, 2029లో జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని, అప్పుడు మీరు చేసిన అతికి మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. పోలీసులు వాళ్ళ ఉద్యోగాలను పణంగా పెట్టి పని చేస్తున్నారని, ఉద్యోగం పోతే కుటుంబ పరిస్థితి ఏమిటనేది కూడా గుర్తుపెట్టుకోవాలన్నారు. మానవ హక్కులను మంటగలిపే అధికారం పోలీసులకు ఎవరిచ్చారన్నారు.

వైసీపీ నేతలను బెదిరించడం, దుర్భాషలాడటం పోలీసులకు తగదన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు కొనసాగించాలని, రైతు ద్రోహిగా మిగలవద్దని సూచించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతాం.. దేనికి భయపడే ప్రసక్తే లేదన్నారు. 2029లో జగన్ రాగానే మళ్లీ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తారన్నారు. అప్పటి వరకు ప్రతి నియోజకవర్గంలో రైతు సదస్సులు ఏర్పాటు చేసి ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ఎండగడతామని స్పష్టం చేశారు.

# పత్రికా రంగంలో 'సూర్య' వార్తలు ప్రశంసనీయం

**క్యాలెండర్ ఆవిష్కరణలో జ్యోతిష శివమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పత్రికా రంగంలో నేటి దినపత్రిక సూర్య వార్తలు ప్రశంసనీయమని ప్రముఖ జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం ముత్తుకూరు మండల కేంద్రం జడ్పీ హైస్కూల్ నందు జరిగిన కార్యక్రమంలో ఆయన తన చేతుల మీదుగా నేటి దినపత్రిక సూర్య2026 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. ఆయనతోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ సందర్భంగా జ్యోతిష శిరోమణి మాట్లాడారు. క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పత్రిక యాజమాన్యం నేడు మంచి కథనాలు పాఠకులకు అందిస్తుందన్నారు. క్వాలిటీ ప్రమాణాలతో క్యాలెండర్ ఉందన్నారు. తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. జడ్పీ హైస్కూల్లో చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థిని పద్మావతి ముత్తుకూరు మండల స్థాయిలో నేటి దినపత్రిక సూర్యకు జర్నలిస్ట్‌గా పని చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ సమస్యలపై జర్నలిజం వ్యవస్థను తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆమెకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విలేజ్ క్లినిక్ బిల్డింగ్ పనులకు శంకుస్థాపన





**టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి లోని ములుమూడి గ్రామంలో 36లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వ విలేజ్ క్లినిక్ బిల్డింగ్ పనులకు నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, టీడీపీ నాయకలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వందలకోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ మండలంలో 116 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. మాటకు కట్టుబడివుండే మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తోడుగా, అండగా ఉంటామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా భావించి పనిచేస్తున్నాము. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో ఎన్నడూ లేని విధంగా రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ జలదంకి సుధాకర్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, జెడ్పి కోఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, మండల కో ఆప్షన్ మెంబర్ మీరామోహిద్దీన్, గ్రామ సర్పంచ్ కుండా కరుణాకర్, ఉప సర్పంచ్ మన్సూర్, ములుమూడి నీటి సంఘం అధ్యక్షుడు అట్ల నరసయ్య, నెల్లూరు రూరల్ మండల టీడీపీ యువత అధ్యక్షుడు అరీఫ్, నెల్లూరు రూరల్ మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సోడెం భాస్కర్, టీడీపీ నాయకులు పులి రామ్ గోపాల్, దబ్బుగుంట కిష్టయ్య, పవన్, మురళి రెడ్డి, నాగరాజు, రామారావు, వేణు, షకీల్, మీర్జా, సిపిఎం నాయకులు అట్ల అంజయ్య, కళాభారతి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయడం ఒక వరం

- ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగపరచుకోవాలి
- బుచ్చిరెడ్డిపాలెం సీఐ శ్రీనివాస్ రెడ్డి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు సేవ చేయడం ఒక వరం లాంటిదని బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్, కీర్తిశేషులు డాక్టర్ కే.రాజమ్మ స్మారక ఉచిత ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎందరో దాతలు ఉన్నారని వాళ్ళందరూ నిజంగా సేవ చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులో ఆసుపత్రులు, టౌన్ హాలు, గ్రంధాలయాలు, కళాశాలలు అన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఎన్నో సేవా సంస్థలు దాతల సహకారంతో నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. విద్యా, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, అలాంటిది పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్న వసుజ్యోతి చార్టబుల్ ట్రస్టు చైర్ పర్సన్ వసుంధరను, వారి కూతురు జె.రాధిక ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆహ్వానితులు వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, ఐజేయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ అనుముల జయప్రకాష్, ట్రస్ట్ చైర్మన్ జె.వసుంధర, జె.రాధిక యుఎస్ఏ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సీఐ



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ఆత్మకూరు సర్కిల్ పరిధిలో సంక్రాంతి పండుగలను అందరూ ప్రశాంతంగా, ఆనందోత్సాహలతో జరుపుకోవాలని స్తానిక సీఐ జి.గంగాధర్ కోరారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని ఆయన సూచించారు. కోడిపందాలు, పేకాట తదితర జూదం నిర్వహించరాదన్నారు. అలా నిర్వహిస్తే చర్యలు అత్యంత కఠినతరంగా ఉంటాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలు విషయమై తాము గట్టి నిఘా ఉంచామని ఆయన పేర్కొన్నారు. పండుగలను పవిత్రంగా సాంప్రదాయాలకనుగుణంగా, శాంతియుతంగా ఉండేలా అందరూ సహకరించాలని ఆయన పేర్కొంటూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా తీవ్ర చర్యలుంటాయని గంగాధర్ హెచ్చరించారు.

# బీద రవిచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు





**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక కలుగోలమ్మ శాంభవి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం స్థానిక మానస థియేటర్ సెంటర్లో ఉన్న కలుగోళమ్మ శాంభవి అమ్మవారి దేవస్థానంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మనవ రవిచంద్ర ఏఎంసి చైర్మన్ అలేఖ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు వారి ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుక సంబరాలు అంబరాన్ని అంటినాయి మొదటిగా అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 55 కేజీల కేక్‌ని కట్ చేసి అనంతరం అభిమానుల మధ్య పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అలాగే రక్తదాన శిబిరాన్ని కావలి డిఎస్పి శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎన్నంటి ఉండి వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని కష్టాలు పెట్టినప్పటికీ ఎదురొడ్డి నిలబడి, తమ కార్యకర్తలని కాపాడుకున్న బీద రవిచంద్ర యాదవ్ అని వారు పార్టీకి చేసిన విశిష్టమైన సేవలను కొనియాడారు. అలాగే పార్టీ గుర్తించి ఈరోజు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుగా, ఎమ్మెల్సీగా నియమించడం తన సారథ్యంలో నెల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అభిమానులకు ఎంతో సంతోషంగా ఆనందంగా ఉన్నది అని చెప్పే దానికి ఈ పుట్టినరోజు సంబరాలు నిదర్శమని వారు తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పార్టీని ఇంకా బలోపేతం చేసేందుకు కూడా మా వంతుగా ఇంకా కృషి చేస్తామని వారు తెలిపారు.

# వీబీ జీ రామ్ జీ పేరుతో తీసుకు వస్తున్న కొత్త విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

## జిల్లా డీసీసీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ వికాసిత్ భారత్ జీ రామ్ జీ పేరుతో తీసుకు వస్తున్న కొత్త విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐసీసీ, ఏపీసీసీ ఆదేశాల మేరకు పేదలకు అండగా ఉండే ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు జిల్లా డీసీసీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పరిరక్షణ పోరాటంలో భాగంగా ఆదివారం గాంధీ బొమ్మ సెంటర్ లో ఒక్కరోజు ఉపవాస దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ.. గ్రామీణ పేద ప్రజల పని చేసే హక్కుగా నరేగా పథకానికి 20 ఏళ్లు విజయవంతంగా నడుస్తుంటే, మోడీ ప్రభుత్వం గాంధీ మహాత్ముని పేరు తీసేసి విబి జీ రామ్ జీ అనే నూతన పేరుతో పేద బ్రతుకుల జీవితాలలో చీకటిని మిగల్చబోతున్నారని, నరేగా చట్టం కనీస వేతనాల ప్రకారంగా పని చట్టబద్ధమైన హామీగా 15 రోజులలోపు పని కల్పించాల్సిన బాధ్యత ఉండేదని, పని చూపు లేకపోతే వారికి హక్కుగా వేతనం ఇచ్చే విధంగా చట్టంలో ఉండేదని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని బలహీన పరుస్తూ ఆర్థిక భారం 40 శాతం రాష్ట్రాలు భరించేలా చట్టం రూపొందించడం వల్ల రాష్ట్రాలు ఆర్థిక భారం వలన పథకం నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని దీనివల్ల రాష్ట్రంలో 70 లక్షల మంది ఉపాధి పై ప్రభావం ఏర్పడుతుందని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా భారత దేశ కార్మికుల జీవనాధారమైన ఈ పథకం కరోనా సమయంలో అప్రకటిత లాక్ డౌన్ వలన కార్మికులు స్వగ్రామాలకు వెళ్తే 4.6 కోట్ల ముందుకి ఉపాధి కల్పించిందని, ఇప్పటివరకు 180కోట్లకు పైగా పని దినాలు సృష్టించబడ్డాయని, దేశంలో అత్యంత ప్రభావితమైన విజయవంతమైన పథకాలలో ఇది ఒకటని అన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై దురుద్దేశాలను గత 11 సంవత్సరాల్లో వేతనాలు చాలా తక్కువగా పెంచి, 125 రోజులు నిబంధన అనేది బూచిగా చూపించి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకున్నారని వివరించారు. దీనివలన రాబోయే రోజుల్లో నిరుద్యోగం, వలసలు పెరుగుతాయని, పంచాయితీలు తమ అధికారాలు హక్కులు కోల్పోతాయని వాపోయారు. కావున కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పేద ప్రజలకు అండగా ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎ పరిరక్షణ పోరాటం చేస్తుందని, హామీతో కూడిన పని, హామీతో కూడిన వేతనం, హామీతో కూడిన జవాబుదారీతనం కల్పించాలని ఎంజిఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టాన్ని యధాతథంగా రాజ్యాంగబద్ధహక్కుగా పునరుద్ధరించాలని, కనీస వేతనం 400 రూపాయలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నట్లు





తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పెత్తందారీ వ్యవస్థను వ్యతిరేకిస్తూ ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. బిజెపి అంటేనే బాబు జగన్ పవన్ అనే విధంగా బిజెపి పార్టీ చేసే అన్ని నల్ల చట్టాలకు ఈ ప్రాంతీయ పార్టీలు కేంద్రంతో మద్దతు తెలపడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని, ఈ రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని.. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలమ్మ నాయకత్వంలో ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ నేతలు పోరాటాలు చేస్తూనే ఉంటారని గంటపదంగా ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అనంతరం మను బోలు మండలంలోని అక్కంపేట గ్రామ సర్పంచ్ నారపరెడ్డి జామావతి ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని చేసిన గ్రామసభ తీర్మానం తమ కుమారుడైన జిల్లా పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డికి అందించి పోరాటానికి మద్దతు తెలియజేశారు. ఈ పోరాటానికి మద్దతు తెలిపిన వామపక్ష పార్టీ నేతలకు, రైతు సంఘం నాయకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ యశోదర, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ కే.సంజయ్ కుమార్, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జ్ అడ్వకేట్ సుదీర్, రూరల్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాజా, నియోజకవర్గల కోఆర్డినేటర్లు సీనియర్ నాయకులు, మైనార్టీ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి

## చింతలపాలెంలో గొట్టుపాటి, కాకర్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** యువత చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకొని క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని ఉన్నతంగా ఎదగాలని జలదంకి మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతలపాలెంలో ఎన్డీఏ యూత్ ఆధ్వర్యంలో గొట్టిపాటి కాకర్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ పోటీలను టిడిపి మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాథ్ రెడ్డి, జనసేన పిఓసి నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రీడాకారులు ఎటువంటి వివాదాలు లేకుండా శాంతియుతంగా క్రీడ స్ఫూర్తితో, క్రీడలు జరుపుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలోని ప్రతిభను వెలుకి తీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన జలదంకి మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు పిఓసి కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యువతను ఉత్సాహపరిచేందుకు వారిలో క్రీడా స్ఫూర్తిని నింపి గొట్టుపాటి కాకర్ల ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులకు తను ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామాల్లో యువత సమాజ అభివృద్ధికి తోడ్పడడంతోపాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఆడడం మంచి పరిణామం అని అన్నారు. యువత మంచి నడవడికతో ఆత్మ సైర్యంతోపట్టుదలతో అన్ని రంగాల్లో విజయాలు సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రజలు సంక్రాంతి పండుగను ఉల్లాసభరితంగా ఆనందోత్సవాలతో జరుపుకోవాలని అన్నారు. అనంతరం బిజెపి జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో క్రికెట్‌కు దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఎంతో క్రేజ్ ఉందని అన్నారు. అటువంటి క్రికెట్ పోటీలను యువతను ఉత్సాయపరిచేందుకు చింతలపాలెం గ్రామంలో గొట్టుపాటి కాకర్ల ప్రీమియర్ లీగ్ పేరుతో టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. నిర్వాహకులు అయినా ఉప్పుటూరి సుధీర్ బాబుతో పాటు నిర్వాహకులు అందరికీ తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ముచ్చలా మధుసూదన్ రెడ్డి, జనసేన నాయకులు నిమ్మలపల్లి రామచైతన్య, మేనేజ్మెంట్ వంటేరు రాకేష్, మహేష్ రెడ్డి, నవీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ వేడుకల్లో పూర్వ విద్యార్థులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఈదురు ఈశ్వరమ్మ రాష్ట్ర ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ వేడుకలు కార్యక్రమం ఘనంగా జరిగింది. హై స్కూల్ నందు 2000-2001 విద్యా సంవత్సరం నందు పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు బృందం 25 సంవత్సరాలకు తాము చదువుకున్న హైస్కూల్ ప్రాంగణాన్ని వేదిక చేసుకుని ఈ కార్యక్రమాన్ని చేసుకున్నారు. తొలుత చదువుల తల్లి సరస్వతీ దేవికి గురువులతో కలిసి పూజ కార్యక్రమాలు చేశారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను అన్వేషించుకుని ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానించారు. అప్పటి ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రముఖ జ్యోతిష శిరోమణి డాక్టర్ జివి మురళీకృష్ణ, విద్యార్థుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. గురువులను వేదికపైకి తీసుకువచ్చి వారి ఆశీస్సులను పూర్వ విద్యార్థులు పొందారు. గురువులకు పాదాభివందనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వారికి జ్ఞాపికలు అందజేశారు. సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ వేడుకల్లో పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఒక్కొక్కరు తమ విద్యార్థి దశ జ్ఞాపకాలతోపాటు ప్రస్తుతం తాము చేస్తున్న వృత్తి వివరాలను తెలియజేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కో రంగంలో ఉండడాన్ని చూసి గురువులు తన్మయం చెందారు. ఉన్నత శిఖరాలకు ఎదిగిన విద్యార్థులను చూసిన గురువులు శభాష్ అన్నారు. అనంతరం గురువులు మాట్లాడారు. ఆనాడు విద్యా బోధనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోధించామన్నారు. చదువు విషయంలో విద్యార్థులను బెత్తం దెబ్బలు కొడితే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులకు మద్దతుగా నిలిచేవారని అలాంటి పరిస్థితులు నేడు లేవన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాల వల్ల విద్యార్థులను చదువు విషయంలో ఏమి అనలేని పరిస్థితి ఉందన్నారు. పూర్వ విద్యార్థులు జీవన చదరంగంలో మెలకువగా రాణిస్తూ పిల్లలకు విలువలు, విశ్వసనీయత, క్రమశిక్షణ, అంకితభావం, సమయస్ఫూర్తి, పెద్దలపట్ల గౌరవం, పొదుపు లక్షణాలు తెలియజేయాలని గురువులు సూచించారు. జీవితంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆర్థిక రంగంలో కూడా పొదుపు పాటించాలని గురువులు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# సిటీలో 50వేల మొక్కలు నాటడమే మా లక్ష్యం

**మంత్రి పొంగూరు నారాయణ**





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 50వేల మొక్కలు నాటడమే లక్ష్యం అని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 28వ డివిజన్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. 14వ డివిజన్ సాయిబాబా గుడి వద్ద ద్వారకామాయి నగర్‌లో చెట్లు నాటే కార్యక్రమాన్ని ఆదివారం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ స్థాయిలో 2000 మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క వీధిలో ఒక్కొ రకం పూలు పూచే విధంగా చెట్లు నాటడం జరుగుతుందన్నారు. ప్రతి డివిజన్లో ఐదు మీటర్లకి ఒక మొక్క నాటడం జరుగుతుందన్నారు. తాను పలుమార్లు చండీగర్ సిటీని విజిట్ చేయడం జరిగిందని అక్కడ పచ్చదనం బాగుంటుందన్నారు. ప్రతి ఐదు మీటర్లకి ఒక చెట్టు ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పచ్చదనం పెంపొందించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారన్నారు. నెల్లూరులోని అన్ని మున్సిపాలిటీలలో మంచినీటి వసతి, పాఠశాలలు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్, రోడ్లు, డ్రైన్లు, హాస్టళ్లో, కమ్యూనిటీ హాలులు అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. నగరంలోని 13 డ్రైన్లను అభివృద్ధి చేయడం జరుగుతుందని అందులో భాగంగా ఎనిమిది డ్రైన్స్ మరమ్మతుల ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో మిగిలిన ఐదు డ్రైన్లను కూడా త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పచ్చదనం పెంపొందించే విషయమై గ్రీన్ కార్పొరేషన్, నగర్ పాలక సంస్థ సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. దీని కొరకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2017లో వచ్చిన తుఫాన్ కారణంగా చాలావరకు నగరం మునిగిపోవడం జరిగిందని అటువంటి పరిస్థితి మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిధులు కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ఖజానా ఖాళీ అయినప్పటికీ విడతల వారీగా పూర్తి చేయడం జరుగుతుందని ప్రజలు కొంత సంయమనం పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతరెడ్డి, గ్రామ వార్డు సచివాలయాల అధికారిని హిమబిందు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, పసుపులేటి మల్లి, రామాంజనేయరెడ్డి, రమణ కుమార్, మీరాబాషా స్థానిక టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్టలో పొగాకు సాగు.. ఆశాజనకంగా దిగుబడి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** సకాలంలో వర్షాలు పడక, పంటలు పండక జీవనం సాగించలేక వలస బాట పడుతున్న ప్రాంతం. డెల్టా ప్రాంతం కాకపోయినా మెట్ట ప్రాంతంలో వ్యవసాయంలో లక్షలు ఘడిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ప్రధాన పంటగా పొగాకు పంటను సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో ప్రాజెక్టులు, కాల్వలు లేకపోవడంతో బోరుబావులు ఆధారంగా పంటలు సాగు చేస్తుంటారు. వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో సుమారు 300 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేస్తున్నారు ఇక్కడ రైతులు. గత రెండేళ్లుగా పొగాకు బోర్డు మంచి గిట్టుబాటు ధరలు కల్పించడంతో ఈ ఏడాది ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ముందుగా పంటను సాగు చేసేందుకు పొలం దుక్కిదున్ని నారుమడి వేస్తారు. వ్యవసాయ పద్ధతులు పాటించి మంచి నారు తయారు చేసి ఇతర ప్రాంతాలకు ఎకరా నారుకు ఆరు వేలు చొప్పున నారును విక్రయిస్తున్నారు. అలాగే వారి సొంత పొలాల్లో పంటను సాగు చేసి మంచి దిగుబడి సాధిస్తున్నారు. ఎకరా సాగుకు విత్తనాలు, నారు, పొలం దుక్కి, మందులు, కూలీలు, పొగాకు క్యూరింగ్ వరకు మొత్తం ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు లక్షన్నర మిగుతుందని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పొగాకు పంటను జీవనాధారంగా భావిస్తారు ఇక్కడ రైతులు. గత రెండేళ్లుగా పొగాకు బోర్డు మంచి గిట్టుబాటు ధరలు కల్పించడంతో ఈ ఏడాది ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఏది ఏమైనా వ్యవసాయంలో మెలకువలు పాటించి లక్షలు ఘడిస్తున్నారు ఇక్కడ రైతులు.

# అంతరంగ ద్వీపం పుస్తక ఆవిష్కరణ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని హోటల్ శివం ఇంటర్నేషనల్‌లో కవయిత్రి, ఉపాధ్యాయురాలు పొర్లపల్లి నాగేశ్వరి రచించిన కవితా సంపుటి 'అంతరంగ ద్వీపం' పుస్తకావిష్కరణను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విమల సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిఆర్ఎస్ జెల్ది విద్యాధర్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం వారిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విభిన్న శైలులో కవితలు రాసి తన అంతరంగ ద్వీపం పుస్తకంలో పొందుపరిచి పుస్తకానికి నాగేశ్వరి వన్నెతెచ్చిందన్నారు. ఈ కళాయిత్రికి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆకాంక్షించారు. ఈ అంతరంగా ద్వీపం పుస్తకం ఎక్కువమంది మనసు దోచుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు గోవిందరాజు, సుభద్రదేవి పెన్నా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు, వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచల నరసింహ, ప్రముఖ నవలా రచయిత్రి పెళ్ళకూరు జయప్రద, ఉపాధ్యక్షులు ఇంద్రగంటి మధుసూదన్, తోట సులోచన, కవులు శివకష్ణ, మాధవ సుధా, అంకబాబు, యామిని, రవికుమార్ మునీంద్ర, దయాకర్‌రెడ్డి, జందెం కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ అధ్యక్షతన అర్చకుల సమావేశం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బుచ్చిరెడ్డిపాలెం మండలం, జొన్నవాడ క్షేత్రం, శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు దేవస్థాన చైర్మన్ అశోక్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఉదయం దేవస్థానం ప్రాంగణంలో అర్చకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పన, ఆధ్యాత్మిక సేవల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. దేవస్థానం నందు ప్రతిరోజు హోమం కార్యక్రమం, త్రయోదశి రోజున ప్రదోషకాల పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు శివకృష్ణ శ్రీనివాసులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు, పురోహితులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్లో హిందువుల జీవితాలకు భద్రత లేదు

**బీజేపీ నేత మిడతల రమేష్**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఒక ప్రైవేట్ సంస్థలో ఏజెంట్ల సమావేశం అరవిందనగర్ మన హాస్పిటల్‌లో జరిగింది. అనంతరం బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండను ఖండిస్తూ నిరసన తెలిపారు. మూక దాడులలో 20రోజులలో ఆరుగురు హిందువులు హత్యలకు గురయ్యారు. ఒక్క యేడాదిలో హిందువులపై 41దాడుల సంఘటనలు జరిగాయి. యదేచ్ఛగా హిందూ స్త్రీలపై అఘాయిత్యాలు అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఆస్తులు ఆలయాల ధ్వంసం జరుగుతున్నాయి. బంగ్లాలో మైనార్టీలుగా ఉన్న హిందువులు జీవించే హక్కును కోల్పోతుంటే బీజేపీ తప్ప మనదేశంలో కాంగ్రెస్ లెఫ్ట్ పార్టీలు బంగ్లాలో మూక దాడులను ఖండించే పరిస్థితుల్లో కూడా లేవని రమేష్ పేర్కొన్నారు. అయోధ్య రామ మందిరంలో నమాజ్ చదివేందుకు ప్రయత్నించిన సంఘటనను రమేష్ ఖండించారు. ఈ కార్యక్రమంలో చింతగింజల సుబ్రమణ్యంలు, శ్రీధర్, కృష్ణ రావు, నాగేశ్వరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలి : సీఐ



**కావలి, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి పండుగ సమయాల్లో రోడ్లపై ప్రజలు తమ తమ కార్యకలాపాలు సాగించేందుకు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వారు బట్టల కొనుగోలుకు మరియు తమ సొంత పనులపై పట్టణంలోకి వస్తుంటారు. ప్రజలంతా తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ఒకటో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫిరోజ్ మాట్లాడుతూ, పండుగ ఉత్సవాల మత్తులో నిర్లక్ష్యం వహిస్తే చిన్న పొరపాటే కదా అని ఆలోచిస్తే పెద్ద ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ముఖ్యంగా సంక్రాంతి సమయాల్లో అతివేగంగా వాహనాలు నడపడం, ప్రమాదకరం మైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లరి చేయడం, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలని స్పష్టంగా తెలియ చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి పండుగను సురక్షితంగా, ఆనందంగా కుటుంబంతో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అద్వితీయప్రతిభాశాలి, రచనల రూపశిల్పి నాగేశ్వరమ్మ



- అంతరంగద్వీపం పుస్తకావిష్కరణ
- అతిధుల ప్రశంశలరుఝల్లులు
- సన్మానాలఅభినందనలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గృహిణిగా, ప్రభుత్వ ఉపాధ్యాయినిగా, ఉపాధ్యాయసంఘ నేతగా రిణిస్తూనే అచిరకాలంలో అధికసంఖ్యలో రచనలు చేసిన పార్లపల్లి నాగేశ్వరమ్మ అద్వితీయప్రతిభాశాలి, అపురూప రచయిత అని హైదరాబాదుకు చెందిన విమల సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జెల్లి విద్యాధర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం రచయిత్రి పార్లపల్లి నాగేశ్వరమ్మ రచించిన అంతరంగద్వీపం పుస్తకావిష్కరణ కార్యక్రమం నెల్లూరు శివం ఇంటర్నేషనల్ హెూటల్ పంక్షన్‌హాల్‌లో పెన్నారచయితల సంఘం ఆధ్వర్యంలో అత్యంత అట్టహాసంగా నిర్వహించగా విద్యాధర్‌రావు విశిష్ట అతిధిగా హాజరయ్యారు. పెన్నారచయితలసంఘ అధ్యక్షురాలు, బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజులు సుభద్రాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాధర్‌రావు, ముఖ్య అతిథులుగా హాజరైన తొలినవలా రచయిత డాక్టర్ పెళ్లకూరు జయప్రదసోమిరెడ్డి, కేంద్రసాహిత్య అకాడమి బాలసాహిత్య అవార్డుగ్రహీత గంగిశెట్టి శివకుమార్, విశాలాక్షి సంపాదకులు ఈతకోట సుబ్బారావు, ఇతర అతిధులు, కవులు, రచయిత్రులు అంతరంద్వీపం పుస్తకాలను ఆవిష్కరించారు. పెన్నారచయితలసంఘ గౌరవాధ్యక్షుడు అవ్వారుశ్రీధర్‌బాబు ఈపుస్తకాన్ని సమీక్షించారు. పెన్నారచయితల సంఘం కార్యదర్శి తోట సులోచన, ఉపాధ్యక్షులు ఇంద్రగంటి మధుసూధన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పార్లపల్లి హజరత్తయ్య, ఏపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య, తదితరులు ప్రసంగించారు. పెరసం కోశాధికారి అన్నం శివకృష్ణ ఆధ్వర్యంలో కవిజమ్మేళనం నిర్వహించగా పలువురు కవులు, రచయితలు తమ రచనలను చదివి విన్పించారు. ఈసందర్భంగా విద్యాధర్, ఇతర అతిధులు, ప్రముఖ కవులు, రచయితలు ప్రసంగాస్తూ రచయిత పార్లపల్లి నాగేశ్వరమ్మ ప్రతిభను, ఆమె చేస్తున్న సాహిత్యాభివృద్ధి కృషిని వివరించి అభినందనలతో ముంచెత్తారు. ఆమె పాధ్యాయినిగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించడంతోపాటు నాలుగేళ్ళక్రితం సాహిత్యాభిలాషతో తన కలంలో రచనలకు శ్రీకారం చుట్టి జైత్రయాత్రలాగా కొనసాగుతూ ఇప్పటికే 700 వచనకవితలు, 200నానీలు, 300సప్తపదులు, 20కథలు చరించి తాజాగా అంతరంగద్వీపం పుస్తకాన్ని అద్భుతంగా రచించారని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు, గాయత్రి పవర్ శక్తి మహిళా అవార్డు, హైదరాబాదు ఎన్జీవో సంస్థనుండి ఎక్సలెన్సీ అవార్డు, మిత్రరత్న అవార్డు, ఉత్తమగృహిణి అవార్డు, మినిస్ట్రీఆఫ్ఇండియా ద్వారా అభినందనపత్రం, పలు పురస్కారాలు, అభినందనలు, ప్రశంశలు, కలంఛాంపియన్, కలం భూషణ్, శతకవితాస్రష్ట, శతకవిభూషణ్, సాహితీసరస్వతి తదితర బిరుదలను అచిరకాలంలోనే ఆమె కైవసం చేసుకున్నారంటూ కొనియాడారు. ఆమె



రచనలు అర్ధవంతంగా, సందేశాత్మకంగా, ఆవేదన, ఆక్రోశం, ఆవేశం తదితర భావాలు ఉట్టిపడేలా ఉంటాయని, ఆమె కవితలు, రచనలు అనేక పత్రికల్లో ప్రచురితం కాగా రేడియో, టివిల్లో ప్రసారమయ్యాయని వారంతా నాగేశ్వరమ్మ ప్రతిభను ప్రశంశించి ఆమె సాహిత్య విజ్ఞాన, మేధాసంపత్తిని కొనియాడారు. భవిష్యత్తులో అందరి ప్రోత్సాహంతో మరిన్ని రచనలు, కవితలు రూపొందించాలని, మరిన్న అవార్డు, ప్రశంశలు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు కూనిఅంకబాబు, చిన్ని నారాయణరావు, జయలక్ష్మి, పెరసం గౌరవాధ్యక్షుడు అన్నం శివకృష్ణ ప్రసాద్, పెరసం ప్రతినిధులు, పలువురు కవులు, రచయితలు ,నాగేశ్వరమ్మ బంధువర్గీయులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాగేశ్వరమ్మను పెరసం ప్రతినిధులు, రచయితలు, కవులు, బంధువర్గీయులైన పార్లపల్లి హజరత్తయ్య, నాగరాజారావు, సుధాకర్‌రావు, సోమా వెంకటసుబ్బయ్య, పార్లపల్లి వెంకటేష్, హెచ్,మోహనప్రసాద్, తదితరులు కుటుంబసమేతంగా నాగేశ్వరమ్మను శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు, కానుకలతో సన్మానించి అబినందించారు. నాగేశ్వరమ్మ అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ రచయితలు, కవులు, స్నేహితులు, బంధుమిత్రులు సహకారంతో, ప్రోత్సాహంతో రచనలు చేస్తున్నానని, భవిష్యత్తులో మరిన్ని రచనలు చేస్తానని పేర్కొన్నారు. నాగేశ్వరమ్మ, శ్రీహరిబాబు దంపతులను, నాగేశ్వరమ్మ, తల్లిరతన్నమ్మలను కూడా ఘనంగా సన్మానించారు.

# పోలేరమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి





**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం బ్రాహ్మణ క్రాక అగ్రహారం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లి పొంగళ్ళు మహెూత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతోంది. ఈ మహెూత్సవంలో కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలేరమ్మ తల్లి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, ఐశ్వర్యవంతంగా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ దేవతల పండుగలు ప్రజల్లో ఐక్యతను, భక్తిని పెంపొందిస్తాయని అన్నారు. సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడంలో ఇటువంటి మహెూత్సవాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. పోలేరమ్మ తల్లి కృపతో గ్రామం ఎల్లప్పుడూ శాంతి, సమృద్ధితో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# కోడిపందాల స్థావరాలపై పోలీసులు దాడులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గల కాళీ ప్రదేశంలో కొంతమంది వ్యక్తులు కోడిపందాల ఆడుతున్న అట్లు సమాచారం కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావుకు సమాచారం రాగా వారి ఆదేశాల మేరకు కావలి రూరల్ ఎస్ఐ బాజీ బాబు, తిరుమలరెడ్డి కొత్తపల్లి అటవీ ప్రాంతంలో జరుగుతున్న కోడిపందా స్థావరాలపై దాడులు నిర్వహించి, ఐదు మంది వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 1530 రూపాయలు నగదును ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎక్కడైనా గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, కోడిపందాలు, ఆడుతున్నట్లు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నచో వెంటనే సీఐ జి.రాజేశ్వరరావుకు తెలియజేయాలని కోరారు.

## గ్రామాలలో గడప గడపకు కరపత్రాలు పంపిణీ

- సీపీఐ సీనియర్ నాయకులు, పముజుల దశరధరామయ్య



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామం నందు సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గ్రామాలలో గడప గడపకు కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పముజుల దశరధరామయ్య పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18 తేది ఆదివారం నాడు ఖమ్మం నడిబొడ్డున జరిగే "సిపిఐ శత జయంతి" వేడుకలు ముగింపు సభకు రాష్ట్ర పార్టీ మరియు జిల్లా పార్టీ నాయకత్వం కలిసి 100 సంవత్సరాల సందర్భంగా జరుగుతున్న వేడుకలో సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొనేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభతరంగా ప్రయాణం చేయుటకు ప్రతి కార్యకర్త ఆ సభలో పాల్గొనేందుకు అవకాశం ఉండాలని ఉచిత రైలు సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్క కార్యకర్త సిపిఐ వంద సంవత్సరాల వేడుకలు భాగస్వామ్యులై ఆ యొక్క వేడుకలను జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు. ప్రతి గడపకు సిపిఐ శతజయంతి ఉత్సవాల కరపత్ర ఆహ్వానం పంపిణీ చేస్తున్న సిపిఐ నెల్లూరు రూరల్ మండలం కార్యదర్శి అంకయ్య, మండల సహాయ కార్యదర్శి ఆదినారాయణ, ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పముజుల హరి, గ్రామ ఉప సర్పంచ్ సల్ల నరసయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, ఆది శేషయ్య, వెంకటరమణ, పెంచలయ్య, శ్రీనివాసులు, తదితర కామ్రేడ్స్ పాల్గొనడం జరిగింది.

# ఎమ్మెల్యే ఫ్లెక్సీ చించివేత

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక ట్రంకు రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కావ్య కృష్ణారెడ్డి ఫ్లెక్సీని వారి అభిమానులు 30వ వార్డు ప్రజలు ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం ఆ ఫ్లెక్సీని ఎవరో తెలుగుదేశం పార్టీ వారా.. లేక వైసిపి వారా.. లేకపోతే ఎమ్మెల్యేపై కక్ష ఉన్నవారా.. ఈ విషయం తెలియాల్సి ఉంది. కావలి పట్టణంలో ఆదివారం స్థానిక కలుగోలమ్మ శాంభవి అమ్మవారి ఆలయంలో తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరు జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, మాజీ ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రస్తుత ఏఎంసి చైర్మన్ అలేఖ్య ఆధ్వర్యంలో బీద అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఘనంగా బాణసంచా కాల్చి, 55 కేజీల కేకును కట్ చేయడం అనంతరం, రక్తదాన శిబిరాన్ని కూడా కావలి డీఎస్పీ ప్రారంభించడం, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అయితే కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఈ కార్యక్రమానికి గైహాజరు అయ్యారు. ఈ విషయంపై కావలి పట్టణంలో పలు ప్రాంతాల్లో కావలి ఎమ్మెల్యే ఎందుకు గైహాజరయ్యారు. అనే ప్రశ్న ప్రజల్లో బీద అభిమానుల్లో ఉండిపోయింది. అదే సమయం లో కావలి విట్స్ గ్రౌండ్‌లో జనసేన సిద్దు ఆధ్వర్యంలో రంగవల్లి పోటీలు కూడా నిర్వహించడం గెలిచిన వారికి బహుమతులు అందజేయడం కార్యక్రమం కూడా పెట్టడం జరిగింది. అయితే కావలి పట్టణం, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కావ్యపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతుంది. అనే విషయం ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ జేస్తూ ట్రంకు రోడ్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్స్ నాలుగు భాగాలలో ఫ్లెక్సీని రంధ్రాలు వేయడం జరిగింది. ఎక్కడైనా ఫ్లెక్సీలు అధికార పార్టీ వారివి ఉంటే వారి ఫ్లెక్సీని చించి వేయడంలో అంతర్యం ఏమిటి.. ఎవరు ఈ దారుణానికి వడిగట్టారు. కావలి పట్టణ ప్రజల్లో చర్చ జోరుగా సాగుతుంది. విధానం కావలి పట్టణంలో మొదటిసారి కాదు ఇది రెండోసారి అధికార పార్టీ వల్ల ఫ్లెక్సీలు చించి వేయడం అనేది ఆ పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బగ్గు మన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంత వ్యతిరేకత, ఎంత కక్ష, ఎంత వ్యతిరేకత ఎమ్మెల్యే కావ్య పై లేకపోతే ఇలాంటి కక్షపూరితమైన పనులుచే చేశారో అనే విషయానికి ఇది నిదర్శనం. కావలి పట్టణంలో 30వ వార్డులో గతంలో ఏఎంసి చైర్మన్ అలేఖ్య ఫ్లెక్సీలు కూడా ఇదేవిధంగా చించి వేయడం తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు దాన్ని లైట్గా తీసుకోబట్టి ఈరోజు ఈ దారుణానికి సిద్ధపడ్డారు. అదే గతంలో ఏఎంసీ చైర్మన్ ఫ్లెక్సీని చించివేసినప్పుడే చించిన వారిపై చర్యలు తీసుకొని ఉండి ఉంటే ఇప్పుడు ఈ సమస్యలు ఉండేవి కావని విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో కావలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ఏమి జరుగుతుందో అన్న ఆందోళన తెలుగుదేశం పార్టీ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కావలి పట్టణంలో ఏమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఫ్లెక్సీ చించివేత పై పలు ప్రాంతాలలోజోరుగా చర్చ జరుగుతోంది. అసలు కావలి తెలుగుదేశం పార్టీలో ఏమి జరుగుతుంది. రోజు రోజుకి కావలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే పై పెరుగుతున్న వ్యతిరేకత. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర జన్మదిన వేడుకలుకు ఎమ్మెల్యే కావ్య గైర్యాజరుకావడంతో పలు అనుమానాలకు బలం చేకూర్చినట్లయింది. అదే సమయంలో విట్స్ గ్రౌండ్‌లో రంగవల్లి పోటీలు, కావలి పట్టణంలో ఎక్కడ పట్టిన ఒకే చర్చ జోరుగా సాగుతుంది.**



# సాతునుపల్లిలో సంక్రాంతి క్రికెట్‌పోటీలు ప్రారంభం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని కరటంపాడు మజరా సాతానుపల్లిలో ఆదివారం సంక్రాంతి క్రికెట్ పోటీలను రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు ప్రారంభించారు. సాతానుపల్లి యువత గత 12సంవత్సరాలుగా సంక్రాంతి పండుగల సందర్భంగా యువతను క్రీడలపట్ల ప్రోత్సహించాలన్న లక్ష్యంగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తుండడం, ప్రధానభూమిక ఆగ్రామ యువనాయకుడు, సోమశిల ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్ పూనుగుంట ధనుంజయ నిర్వహిస్తుండడం తెల్సిందే. ఈదపా కూడా ఎస్‌పిఎల్‌యూత్ ఆధ్వర్యంలో పోటీలను ఏర్పాటుచేయగా దావా పెంచలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పెంచలరావు మాట్లాడుతూ ఆటలు, క్రీడలు దేహదారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని, పెంపొంది స్తాయన్నారు. సంక్రాంతి పండుగల సందర్భంగా యువత చెడుత్రోవతొక్కుకుండేలా ఈపోటీలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకుడు ఒంటేరు మల్లికార్జున కూడా పాల్గొన్నారు. దావా పెంచలరావును, ఒంటేరు మల్లికార్జునను ఈసందర్భంగా సాతానుపల్లి యూత్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ధనుంజలయ మాట్లాడుతూ..



యువతను ఆటలు, క్రీడలపట్ల దృష్టిసారించేలా ప్రోత్సహించాలన్న లక్ష్యంగా తమవంతుగా యూత్ ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తూ విజేతలకు ఆకర్షణీయమైన బహుమతనందిస్తున్నామని పేర్కొన్నారు. ఈపోటీలను సోదరభావంతో శాంతియుతంగా ఆనందోత్సాహాల మద్య నిర్వహిస్తామని ధనుంజయ పేర్కొన్నారు. 40జట్లతో ఈపోటీలను అత్యంత ఘనంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో పూనుగుంట ధనుంజయ, నరశింహరావు, కాంతారావు, సాతానుపల్లి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలి

▸ సాయి విద్యానికేతన్ కళాశాల ▸ విద్యార్థుల వీడ్కోలు సభలో వక్తలు






**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకుని ఆనంద జీవితం గడపాలని వక్తలు సూచించారు. సాయి విద్యానికేతన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆదివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. అలాగే విద్యానికేతన్ సంస్థల అధినేత బాడోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ్వతీయ సంవత్సరం విద్యార్థులు వెళుతున్నందుకు బాధగా ఉన్న వారు ఉన్నత విద్యలకు వెళ్లి ఆనందకరమైన జీవితాలను గడపాలని సూచించారు. సాయి విద్యానికేతన్ జూనియర్ కాలేజీల సీఈవో రవితేజ, సతీమణి డాక్టర్ రాజరాజేశ్వరిలు.. విద్యార్థులకు చక్కని ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మునిశేఖర్, ఆధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# కంచి సామాజికసేవల విస్తరణకు శ్రీకారం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో నిత్యాన్నదాతగా నిత్యం ప్రజలకు భోజన సౌకర్యం కల్పిస్తూ అనేక సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మృతిచెందిన పేదకుటుంబాలకు అంత్యక్రియిలకోసం 10వేల రూపాయల ఆర్థికసాయం చేసే కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలా నికి విస్తరిస్తూ నిర్ణయించారు. ఆదివారం ఆత్మకూరులోని స్పార్క్‌సిటీలో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో కంచిపరమేశ్వరరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. తాను నిర్వహిస్తున్న సామాజికసేవా కార్య క్రమాల్లో ఒకటిగా ఉన్న పేదప్రజలు మృతిచెందితే అంత్యక్రియలకోసం 10వేల రూపాయల ఆర్తికసాయమందిస్తున్నానని, ఈనెల 15వ తేదీ నుండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా మృతిచెందే పేదకుటుంబాలను ఈ కార్యక్ర మాన్ని విస్తరించనున్నామని ఆయన పేర్కొన్నారు. పేదప్రజలు తమ కుటుం బంలో ఎవరైనా మృతిచెందితే కర్మకాండల కోసం ఇబ్బంది పడుతున్నారన్న పరిస్థితిని గమనించి రెండేళ్ళుగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మృతుల కుటుంబాలకు 10వేల రూపాయల వంతున అందజేస్తున్నానన్నారు. కాగా ఆత్మకూరు మండలంలో కూడా పలువురు పేదలు ఇబ్బందిపడుతున్న పరి స్థితిని గుర్తించి తాను చేసే ఆర్థికసాయం కార్యక్రమాన్ని మండలానికి విస్తరించేలా నిర్ణయించానన్నారు. ఆత్మకూరు మండలంలోని ఏగ్రామంలో నైనా ఎవరైనా పేదవర్గాలకు చెందిన వారు మృతిచెందితే ఆ కుటుంబాలకు 10వేల రూపాయల ఆర్థికసాయమందిస్తానని పేర్కొన్నారు. తాను రెండేళ్ళ క్రితం ప్రారంభించిన మృతులకుటుంబాలకు ఆర్థికసాయ మందించే కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇప్పటివరకు 450మందికి 45లక్షల రూపాయల ఆర్థికసాయమందించానని ఆయన వివరించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో ఔట్‌పేషెంట్లు, వారి సహాయకులు, ఇన్‌పేషెంట్ల సహాయకులు వైద్యపరిక్షలు నిర్వహిం చుకున్న అనంతరం పట్టణంలోకి వెళ్ళి భోజనాలు తెచ్చుకోవాల్సిన ఇబ్బందిని గమనించి కంచి పరమేశ్వరరెడ్డి నాలుగేళ్ళ క్రితం ఈ హాస్పిటల్‌లో నిత్యాన్నదానపథకాన్ని ప్రారంభించడం, అందుకోస0 65లక్షల రూపా యలతో పక్కాభవనాలు నిర్మించడం, ఆత్మకూరు పట్టణంలో ప్రజల సౌకర్యార్థం ఒక కైలాస రథయాత్రావాహనం, నాలుగు శీతలశవపేటికల ను సమకూర్చిన సంగతి కూడా తెల్సిందే. కుల, మతాలకతీతంగా, రాజకీ యాల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఆయన సేవలంది స్తున్నారు. ఇప్పటివరకు నిత్యాన్నదాన కార్యక్రమం ద్వారా 5లక్షలా69 వేలా684 మందికి భోజనసౌకర్యం కల్పించారు. అన్నిరకాల కూరలతో నాణ్యమైన భోజనాన్ని సమకూర్చారు. విద్యను ప్రోత్సహించాలని టెన్త్, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థికప్రోత్సాహ మందిస్తున్నారు. విద్యార్థులు రవాణావసతి లేక ఇబ్బంది పడుతుండే వారికి స్వంత నిధులతో వాహనవసతి కల్పించారు.

# సంక్రాంతి కానుకలతో పేదల ముఖాల్లో వెలుగులు

- నేతలకు మంత్రి నారాయణ అభినందనలు
- ముక్కాల ద్వారకానాథ్ మిత్ర మండలి, కొండ ప్రవీణ్ శంకర్ మిత్రమండలి ఆధ్వర్యంలో పేదలకు సంక్రాంతి కానుకల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి






**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు సంక్రాంతి కానుకగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నేతలకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ అభినందనలు తెలిపారు. నగరంలోని ఆరవ డివిజన్లోని పప్పులు వీధిలో కొండ ప్రవీణ్ శంకర్ మిత్రమండలి, ముక్కాల ద్వారకానాద్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు సంక్రాంతి కానుక సేవా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొని ఫలసరుకులను పంపిణీ చేశారు. ముందుగా మంత్రి నారాయణకు సాంప్రదాయ నృత్య ప్రదర్శనతో చిన్నారులు, ఆర్యవైశ్య నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పిల్లలకు మంత్రి నారాయణ గాలిపటలు అందజేసి మీడియాతో మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేస్తున్న కొండా ప్రవీణ్ మిత్రమండలికి అభినందనలు తెలిపారు. సంక్రాంతి కానుక కింద 1020 మంది పేదలకు ఫల సరుకులు పంపిణీ చేసారు. మూడేళ్ళుగా ఈ కార్యక్రమం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అదేవిధంగా సంక్రాంతి కానుకగా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ముక్కాల ద్వారకనాద్ మిత్ర మండలిని అభినందించారు. 2222 మంది పేదలకు సరుకులు పంపిణీ చేసారని, వాళ్ళ కళ్ళలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందన్నారు. మన సంక్రాంతి, మన పెద్దల పండుగ పేరుతో సేవా కార్యక్రమాన్ని ఐదేళ్ళుగా నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా 73 లక్షలతో వాటర్ ట్యాంక్‌లకు టెండర్లు పిలిచామన్నారు.త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, 2014 లోనే 5500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటిని గతప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వాటన్నిటినీ తిరిగి ప్రారంభించామని, పేదపిల్లలకు చదువుని ఆస్తిగా ఇవ్వాలని సంకల్పించానాని, విఆర్సీని అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసామన్నారు. దాతల సహకారంతో మరో 14 హై స్కూల్స్‌ని విఆర్సీ తరహాలో జూన్ కల్లా సిద్దచేస్తామన్నారు. వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్లతో మరో ఇంటర్ నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం అని, ఎవరూ అడగకుండానే ఇవన్నీ చేస్తున్నాన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

# దుర్భరమైన రోడ్లతో అవస్థల ప్రయాణాలు

## నిత్యం ట్రాఫిక్ కష్టాలు





**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో పలు ప్రాంతాల్లో దుర్భరమైన రోడ్లతో ప్రజలు పడే అవస్థలు వర్ణాతీతం. ముఖ్యంగా నగరంలోని విఆర్‌సి, మద్రాస్ బస్టాండ్, మూలపేట, వహబ్ పేట, ఆచారి వీధి, బార్కాస్, పాత మున్సిపల్ ఆఫీసు రోడ్డు, జివిఎన్టి రోడ్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు దుర్భరంగా మారాయి. బారాషాహిదర్గా వద్ద, పొట్టేపాలెం రోడ్డు, ఇలా నగరంలో పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు దుర్భరంగా ఉన్న సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు వాటిపై దృష్టి పెట్టకపోవడం విశేషం. అదేవిధంగా నగరం లో చాలాచోట్ల రోడ్లు దెబ్బతిని ఉన్నాయి. వీటివల్ల నిత్యం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఒకపక్క రోడ్లు సక్రమంగా లేక, మరోపక్క రోడ్లు కుదించుకుపోయి వాహనదారుల జోరుతో ప్రజలు పడే అవస్థలు వర్ణాతితం. నిత్యం రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో అక్కడ రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారినప్పటికీ కనీసం ప్రమాద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం. జిల్లా అధికారులు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించకపోవడం, ప్రజా ప్రతినిధులు వాటిపై సమీక్షలు జరపకపోవడం గమనార్హం. రెండు నియోజకవర్గాల చెందిన రోడ్లు చాలా చోట్ల దెబ్బతిని ఉన్నప్పటికీ వాటిపై అధికారులు పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేయకపోవడం విశేషం. అదేవిధంగా నగరం రోజురోజుకీ విస్తరిస్తూ ఒకపక్క ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుండగా మరోపక్క దెబ్బతిన్న రోడ్లతో వారు పడే అవస్థలు వర్ణాతితం. అదేవిధంగా నగరంలో ఫుట్పాతులు సక్రమంగా లేకపోవడంతో పాదాచారులు రోడ్లపై నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాల జోరుతో దూసుకొస్తున్నారు. వాహనాలు జోరు ఎక్కువై కొన్నిచోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. విఆర్‌సి, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కెవిఆర్ పెట్రోల్ బంక్, ఆచారి వీధి, చిన్న బజార్, పెద్ద బజార్, బార్కాస్, వహబ్‌పేట, ముత్తుకూరు బస్టాండ్, మాగుంట లేఔట్, మినీ బైపాస్, ఆత్మకూరు బస్టాండ్, లాంటి రద్దీ ప్రాంతాల్లో వాహనాల జోరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం మినీ బైపాస్ రోడ్‌లో వ్యాపారులు రోడ్లు ఆక్రమిస్తూ వాహన రాకపోకలకు ఇబ్బంది కరంగా మారాయి. ఇకనైనా అధికారులు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పోలిరెడ్డిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలోని పోలిరెడ్డిపల్లి హైస్కూల్ నందు పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. 1997-98, 1998-99 విద్యా సంవత్సరాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒకే పాఠశాల ప్రాంగణంలో మళ్లీ కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని, భావోద్వేగాన్ని కలిగించిందని పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యాభ్యాసం చేసిన రోజులను గుర్తు చేసుకుంటూ అప్పటి అనుభవాలు, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, పాఠశాల వాతావరణం గురించి పరస్పరం ముచ్చటించుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల విజయంలో క్రమశిక్షణ, కృషి, గురువుల మార్గనిర్దేశంమని తెలిపారు. పూర్వవిద్యార్థులు తమ జీవిత ప్రయాణంలో ఉపాధ్యాయుల బోధనలు ఎంతో ఉపయోగపడ్డాయని కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరుకు ఔటర్ రింగ్ రోడ్ అవసరం లేదు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతానికి నెల్లూరుకు ఔటర్ రింగురోడ్ అవసరం లేదని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్ వేయాలన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఉద్దేశం సరైనదేనన్నారు. ఐతే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం సాధ్యం కాదన్నారు. గతంలో ట్రాఫిక్ అంతా ట్రంక్ రోడ్ మీద హై వే వెళ్ళేదని, రోడ్డును రెండుగా డివైడ్ చేసేదన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఉండేవన్నారు. మినీ బైపాస్ ఏర్పాటు తర్వాత ట్రంక్ రోడ్‌లో ట్రాఫిక్ తగ్గిందన్నారు. త్వరలో నాలుగు లైన్ల బైపాస్‌ను ఆరు లైన్లు చేస్తున్నారని, రూరల్, సిటీలో హైవే పై రెండు అండర్ పాస్‌లు రాబోతున్నాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్‌కి 2వేల కోట్లకు పైగా నిధులు కావాలన్నారు. రోడ్ డిజైన్, భూ సమీకరణకు ఎక్కువ నిధులు అవసరం అవుతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక స్థితిలో అంత కేటాయించే పరిస్థితి లేదన్నారు. తమ అజెండాలో ఔటర్ రింగ్ రోడ్ ప్రస్తావన లేదన్నారు. జనాభా పెరిగి ఇబ్బందులు వస్తే ఓ ఆర్ ఆర్ గురించి ఆలోచిస్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటమే ఎన్డీయే ప్రభుత్వ ప్రధాన అజెండాగా మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన కావలి ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** వడ్డే ఓబన్న 219వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక లత థియేటర్ సెంటర్ వద్ద బ్రహ్మం గుడి సమీపంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. ముందుగా వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని వడ్డెర సంఘ నాయకులు టిడిపి కార్యకర్తలు వార్డు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారి జయంతి సందర్భంగా కేక్ కట్ చేయించి ఆనందంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కావ్య మాట్లాడుతూ వడ్డెర ఓబన్న 2519వ జయంతి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని వడ్డెర అంటే రాజు బ్రిటిష్ వాళ్ళను గజగజలాడించిన వ్యక్తి ఒడ్డెర ఓబన్న. ఆ మహానుభావులు జయంతులను ఘనంగా నిర్వహించడం, రాష్ట్ర ప్రభుత్వ విధానమని సమాజ అభివృద్ధికి, సామాజిక న్యాయానికి వారు చేసిన సేవలు కొనియాడారు. కావలి ట్రంకు రోడ్లో వడ్డెర ఓపన విగ్రహాన్ని నిర్మిస్తానని, విగ్రహానికి న వంతుగా 5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు.ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహా నాయకుడు అని తెలిపారు. ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షురాలు గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షత నిర్వహించనున్నారు. మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. మండలానికి సంబంధించిన వివిధ శాఖల సమస్యలు, అభివృద్ధి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.